నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబ్‌నగర్
శనివారం | జూలై 20. 2024 | www.navatelangana.com

అంగన్వాడీ కేంద్రం తనిఖీ



నవతెలంగాణ- మహమ్మదాబాద్

మండల పరిధిలోని కచింపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులను చదివించి, విద్యార్థుల ముచ్చటించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలకు, చిన్నారులకు అందించే పోషక పదార్థాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, పంచాయతీ సెక్రెటరీ సుభద్ర పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్



నవతెలంగాణ గండీడ్

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ధరణి పనితీరు పెండింగ్ ఫైల్స్ ను పరిశీలించారు. ప్రజాపాలన కేంద్రాల ద్వారా దరఖాస్తుల సవరణ తీరు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం అమలుపరిచిన రుణమాఫీ పై ఆరా తీశారు.కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో దేవన్న,ఎస్సైఐ, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాకట్టులో రైతు భూములు

- వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లో పట్టా పాసుపుస్తకాలు
- అప్పు కోసం వెలితే భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వ్యాపారస్తులు
- అప్పులు తీరినా..రిజిస్ట్రేషన్ చేయడానికి మోహం చాటేస్తున్న వ్యాపారులు
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొన్నది. పెరగిన పెట్టుబడి వల్ల రైతులు పంట సాగుకోసం వడ్డీ వ్యాపార స్తులను ఆశ్రయిస్తున్నారు.ఒక్కో గ్రామంలో 10 నుంచి 20 మంది రైతులు వడ్డీకి డబ్బులు తీసుకొని సొంత భూములను వడ్డీ వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. రైతు సంఘాల నాయకులు చెప్పిన వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు 2500ల మంది తమ భూములను వడ్డీ వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది.అప్పులు తీరినా..భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా నాణ్యుడు దోరణి ప్రదర్శిస్తు ండటంతో రైతులు లబోదిబో అంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా రాయిపాకుల గ్రామానికి చెందిన ఆలేటి రామకృష్ణ కల్వకుర్తికి చెందిన ఓ వడ్డీ వ్యాపారస్తుని దగ్గర రూ. 5 లక్షలు తీసుకున్నాడు. వడ్డీ రూ3లుగా ఖరారు చేసు కున్నారు.అయితే జమానత్ కింద ఎకరం పొలంను వడ్డీ వ్యాపారస్తునికి రిజిస్ట్రేషన్ చేయించుకొని అప్పు ఇచ్చారు. అప్పు తీరి ఏడాది కావస్తున్నా... తిరిగి రైతుకు పొలం రిజిస్ట్రేషన్ చేయమంటే నానా ఇబ్బందులు పెడు తున్నారు. అదే గ్రామానికి చెందిన దళిత రైతు వెంకటయ్య నాలుగు లక్షలు వడ్డీ వ్యాపారస్తుని దగ్గర వడ్డీకి తీసుకున్నాడు. జమానత్ కింద ఒక ఎకరం పొలాన్ని వడ్డీ వ్యాపారస్తుని పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మరో రైతు పాదాల సాయిబాబు ఎకరంన్నర పెట్టి ఐదు లక్షలు తీసుకున్నాడు.. మిత్తి ,అసలు కలిపి మోపెడైయ్యింది. దీంతో ఐదు లక్షలకే 60 గంటల భూమి వడ్డీ వ్యాపారస్తులకే వదిలివేశాడు.

మరో రైతు లింగస్వామి అర ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేసి రెండు లక్షలు అప్పుగా తీసు కున్నాడు. అప్పు తీరినా..భూమి రైతుకు రిజిస్ట్రేషన్ చేయ కుండా ఇప్పుడు అప్పుడంటూ కాలయాపన చేస్తున్నారు ఈ పరిస్థితుల నుంచి గట్టేక్కడానికి రైతులు నానా యాతనలు పడు తున్నారు. కొంతమంది అయితే అప్పుల కిందికి ఇండ్లనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.నూతనంగా ఇంటి నిర్మాణం చేసుకొని వడ్డీ వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు లక్షలు తీసుకొని ఒక ఎకరా రిజిస్ట్రేషన్ చేయిస్తే... రైతులే రిజిస్ట్రీ ఖర్చులు భరించాల్సింది. ఎకరాకు రిజిస్ట్రేషన్ చేసినప్పుడు రూ. 20 వేలు తిరిగి వడ్డీ వ్యాపారస్తుల నుండి రైతు చేయించుకున్నప్పుడు రూ. 20 వేలు ఖర్చు రైతులే భరించాల్సి ఉంది. కొందరు వ్యాపారస్తులకు పూర్తిగా అప్పులు చెల్లించినా.. రైతులకు పట్టాచేయడం లేదు. ఇప్పుడు అప్పుడంటూ..ఏళ్లతరబడి కాలయాపన చేయ డంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు తెలిపారు. రెండేళ్ళ దాటితే వడ్డీ కిందకే సాగు భూములు పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఖర్చులు కలుపుకుంటే రైతుపై రూ. 10ల మిత్తీ పడుతోంది.అనేక మందివడ్డీ వ్యాపారస్తులకు అసలు చెల్లించినా...తిరిగి భూము లను రైతులకు అప్ప చెప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారస్తుల ఆగడాలను చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంట పెట్టుబడి కోసం బిడ్డ పెళ్లి చేయడానికి లేక ఆరోగ్య కారణాల రిత్యా రైతులు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారు.ఇదే అదునుగా భావించిన వ్యాపారస్తులు బంగారు లేక భూమిని కుదవ పెడితేనే డబ్బు వడ్డీకి ఇస్తామని తెగిసి చెబుతున్నారు.దీంతో చేసేది లేక పుట్టగతులు లేని రైతులు మూడు రూపాయలు అంతకంటే అధిక మిత్తికి ఒప్పుకొని తనకున్న రెండు ఎకరాల సాగుభూమిని వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అక్కడి నుంచి రైతుల కష్టాలు మొదల వుతున్నాయి.అధిక మిత్తీ తీసుకుంటూ అప్పు తీరినా...తిరిగి భూమి రైతులకు చేయకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని రైతు సంఘాలు నాయకులు తెలిపారు.

వడ్డీ వ్యాపారస్తులత ఆగడాలు అరికట్టాలి

రైతుల బలహీనతలను దృష్టిలో పెట్టుకొని వడ్డీ వ్యాపారస్తులు రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. వడ్డీ కోసం వ్యాపారస్తుల దగ్గరకు పోతే భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. రెండు రిజిస్ట్రేషన్ ఖర్చులు రైతులనే భరించాల్సి ఉంది.వడ్డీ వ్యాపారస్తులు రూ. 3 ల మిత్తి వసూలు చేస్తే... రిజిస్ట్రేషన్ ఖర్చు ఎకరాకు మరో రూ. 7 రూపాయలు అవుతోంది. ముఖ్యంగా వడ్డీ వ్యాపా రస్తుల ఆగడాలలను నియంత్రించడంలో అధికారులు చొరవ చూపాలి.

ఎ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్ జిల్లా

రెడ్ క్రాస్ సేవలు అమోఘం:ఎమ్మెల్యే యెన్నం



నవతెలంగాణ- మహబూబ్ నగర్

రెడ్ క్రాస్ సేవలు అమోఘమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని టిడి గుట్ట (45 వార్డు) లో ఇండ్లు కూలిపోయిన బాధితులకు ఎమ్మెల్యే చేతులమీదుగా, ఇండియన్ రెడ్ క్రాస్ వారు అందించిన వంట పాత్రలు, ప్లేట్లు , బెడ్‌షీట్లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ అవసరమైన చోట ప్రత్యక్షమౌతుందన్నారు.వారి సేవలకు విలువ కట్టలేమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్. లయన్ నటరాజ్ , డాక్టర్ సామ్యుల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సాయిబాబా , రాములు యాదవ్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ మండల పరిధిలోని మోతీగనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతి శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రవీందర్ ఆకస్మికంగా సందర్శించినారు. తన సందర్శనలో తరగతి గదిలో విద్యార్థుల యొక్క ప్రతిభా పాటాలను పరిశీలించారు.ఐఎఫ్పి ప్యానెల్స్ ద్వారా అన్ని పాఠశాలలో విద్యాబోధన జరగాలని సూచించినారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఉపాధ్యాయులు సమయపాలను పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెంట్ శంభూ ప్రసాద్ కార్యాలయ సిబ్బంది అబ్దుల్ హక్ లు ఉన్నారు.

పండుగ సాయన్న కమిటీకి ఘన సన్మానం

నవతెలంగాణ- హన్వాడ

మండల కేంద్రంలో ఈనెల 17న బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన అన్వాడ మండల పండుగ సాయన్న కమిటీ సభ్యులను విగ్రహ దాత పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ తన నివాసంలో ఘనంగా సన్మానించారు. పండుగ సాయన్న విగ్రహ కమిటీ బృందానికి అండగా ఉండి ముందుకు నడిపించిన సంజీవ్ ముదిరాజ్‌ని ఉద్యమకారుడు మైత్రి ప్రింటర్స్ అధినేత మైత్రి యాదయ్యను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల పండుగ సాయన్న కమిటీ అధ్యక్షులు పల్లెమోన్ యాదయ్య, సభ్యులు కిందికిరణ్, లక్ష్మయ్య పాలమూరు యాదయ్య ,జిల్లెల శేఖర్, వెంకట్, రాములు, వేపూరు రవి, రామకృష్ణ, ముదిరాజులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య ఆన్‌లైన్‌పై అవగాహన



నవతెలంగాణ- మహబూబ్ నగర్

ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ , పీజీ అటానమస్ కళాశాల యందు శుక్రవారం వాణిజ్య శాస్త్ర విభాగం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ మండలి సీఆర్‌పీసీ వారి సమన్వయంతో ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవగాహన, శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ విజయకుమార్ అధ్యక్షత వహిస్తూ విద్యార్థులు విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యవహారాలు జరిపేటప్పుడు తీసుకోవాల్సిన మెళకువలు యూపీఐ ఎలా ఉపయోగించాలన్నా అంశాలపై కుల కుశముగా వివరిం చారు. కొత్తగా వచ్చే తెలియని ఫోన్ నంబర్స్ యొక్క కాల్స్ ను మెయిల్స్ ను స్పందించవద్దని అన్నారు. ఐఎఫ్సి కోడ్ ఉన్న బ్యాంక్ ద్వారా మాత్రమే ఆన్ లైన్ వ్యవహారాలను నిర్వహించాలన్నారు.రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన ఆర్బిఐ హైదరాబాద్ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాధికా భారత్ మాట్లాడుతూ ఈ బ్యాంకింగ్ వ్యవహారాలను చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాలి పిన్‌కోడ్‌ను తరచుగా మారుస్తూ ఉండా లన్నారు.కొత్తగా వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని,సైబర్ క్రైమ్స్ ఎలా జరుగుతాయన్నారు. జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలను జాగ్రత్తల గురించి వివరించారు. తెలియని ఫోన్ నెంబర్ నుండి కాల్స్ వచ్చి నప్పుడు వాటిని ఎలా గుర్తించాలని, అనధికార రంగంలో నుంచి వచ్చే పెట్టు బడులను నమ్మొద్దు అని సులభంగా లభించే డబ్బుని నమ్మొద్దు అని కష్ట పడడానికి మించిన ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చే సిన లీడ్ బ్యాంకు మేనేజర్ కలవ భాస్కర్ మాట్లాడుతూ సాంఘిక ప్రసార మాధ్యమంలో ఎలాంటి ఫోటోలను పోస్ట్ చెయ్యకూడదన్నారు.వీడియో కాల్స్ ను లింక్స్ ను క్యూఆర్ కోడ్లను ఓపెన్ చేయవద్దు వారు తెలిపారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు 1930 అనె నెంబర్ కి 2,3 రోజుల లోపల ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్షియల్ డ్రెస్ కౌన్సిల్ సెక్రటరీ బాబురావు ,సీని యర్ అసి స్టెంట్ ఎస్సే రెహమాన్,అసిస్టెంట్ హర్షవర్ధన్,వాణిజ్యశాస్త్ర విభాగాదిపతి డాక్టర్ నాగలక్ష్మి, వాసంతి,విశాల,అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ- హన్వాడ

మండల పరిధిలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆశ్రయి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను మ్యాట్లు, ఒక జత చెప్పులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు గోపాల్ నాయక్ హాజరై మాట్లాడుతూ పేద బడుగుబలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేయడం శుభ పరిణామన్నారు. ఆశ్రయి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గోపీనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన వలస కార్మికుల ప్రయోజనాల గురించి తమ పని చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్ ,ఉపాధ్యాయులు వినోద్ కుమార్ ,సంతోషిమాత విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మస్జిద్ పై దాడిచేసిన దుండగులను శిక్షించాలి

- ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ ఆధ్వర్యంలో ముస్లింల నిరసన
- కలెక్టర్ కు నాయకుల వినతి పత్రం అందజేత



నవ తెలంగాణ -మహబూబ్‌నగర్

మహారాష్ట్ర, కొల్హాపూర్ జిల్లా విశాల్‌ఘర్ లో ముస్లింల ప్రార్థన స్థలమైన మస్జిద్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు నిరసన చేపట్టారు. జుమా నమాజ్ అనంతరం వివిధ మజీద్‌ల నుంచి వందలామంది ముస్లింలు స్థానిక తెలంగాణ చౌరస్తాకు చేరుకొని అక్కడ కొంతసేపు నిరసన చేపట్టారు. మహారాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసిన్ ఖాన్, పలువురు ముస్లిం సంఘాల నాయకులు మాట్లాడుతూ మహారాష్ట్రలోని విశాల్ ఘర్ లోగల మస్జిద్ పై కొంతమంది దుండగులు దాడి చేసి అక్కడి ముస్లిం నివాసితులపై తీవ్రంగా హింసించడం హేయమైన చర్య అని అన్నారు. దేశంలో రోజు రోజుకు ప్రార్థనా స్థలాలపై, ముస్లింలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా అభద్రతాభావానికి గురిచేస్తున్నాయని అన్నారు. మస్జిద్, ముస్లింలపై దాడులు చేసిన దోషుల పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ తరపున రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని స్థానిక ఐడీఓసీ బిల్డింగ్ లో జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ నిరసనలో ఆయా పార్టీల నాయకులు మోసీన్ ఖాన్, అబ్దుల్ హాదీ, అన్వర్ పాషా, ఇంతియాజ్ ఇసాక్, జాకీర్ అడ్వకేట్, తఖీ హుస్సేన్, హాఫిజ్ ఇద్రీస్, ఖుద్దూస్ బేగ్ షేక్ అబ్దుల్లా, షబ్బీర్ అహ్మద్, సాదతుల్లా హుస్సేని, మహబూబ్, ఫయాజ్ అబ్దుల్ హక్, మునీర్, అహ్మద్ సనా, ఆవేజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది బేడీల పాలన.. కాంగ్రెస్‌ది జిడిలా పాలన

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

సొంత రాష్ట్రంలో టిఆర్ఎస్ పాలన మొత్తం రైతులకు బేడీ లేసి నిర్బంధ పాలన కొనసాగిస్తే కాంగ్రెస్ వచ్చిన ఆరునెలల్లోని రైతు రుణ మాఫీ చేసి రైతులకు డీడీలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్ అన్నారు.శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ ఈ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి జిల్లా రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఇచ్చిన మాట ప్రకారం ఏడు నెలల్లోనే రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇస్తే రాహుల్ గాంధీ రుణమాఫీ చేయించారని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన రైతులు సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు.

గత పాలనలో రైతు రుణమాఫీ పేరుతో ఎవరికి న్యాయం చేయకపోగా అప్పులే మిగిలినవి అని వారు గుర్తు చేశారు. మొదటి దఫలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష లోపు రుణ రుణ మాఫీలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 5829 లోన్స్ అకౌంట్ లో ఉండగా 30.80 కోట్లు కేటాయిం చిందని తెలిపారు. దేవరకద్ర నియోజక వర్గంలో 16 వేల 621 లోన్లు అకౌంటు ఉండగా 84.94 కోట్లు ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఈ మొదటి దప్పల్లోని 80.9 కోట్లు రైతులకు ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్న వాటిలో ఏవి నిజం లేవని వారు తెలిపారు ఇప్పటికే ఆరోగ్యానికి లో అనేక పథకాలు అమల్లో ఉన్నాయన్నారు. ఉచిత బస్సు, 500 కే సిలిండర్, ఉచిత కరెంటు లాంటివి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని గుర్తు చేశారు.ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, జిల్లా కార్యదర్శి సిరాజ్ కాద్రి, అన్వాడ మండల అధ్యక్షులు మహేందర్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు మల్లు నర్సింహారెడ్డి ,మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల కాటుకు మూగజీవాలు మృత్యువాత

- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ- బాలానగర్

బాలానగర్ మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామ శివారులో కుక్కల కాటుకు లేక దూడలు మృత్తి చెందుతు న్నాయని అప్పాజీపల్లి తాండాకు చెందిన శ్రీహరి అనే రైతు తెలిపారు.ఉదయం పూట రియాక్ట్ మెటల్స్ పరిశ్రమలో ఉంటూ రాత్రి వేళలో లేగ దూడలను తిని వేస్తున్నాయని రైతు శ్రీహరి వాపోయారు. పరిసర ప్రాంతాలలో కోళ్ల ఫారాలు ఉండటంతో చనిపోయిన కోళ్లను తింటూ, అవి దొరకనే పక్షాన పశువుల కూటమిలో ఉన్న లేక దూడలను చంపుతున్నాయని వారు తెలిపారు. బాలానగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలల్లో కోళ్ల పరిశ్రమ లున్నాయి. ఆయా గ్రామాలల్లో కుక్కలు పశువులను గొర్రెలను కాటేస్తున్న సంగతి ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

కుక్కలకు మా పరిశ్రమకు ఎలాంటి సంబంధం లేదు

కుక్కలకు మా పరిశ్రమకు ఎలాంటి సంబంధం లేదు.మా పరిశ్రమలకు కుక్కలు రాకుండా ఉండేందుకు చుట్టుముట్టు గోడ ఉన్నదన్న కుక్కలు రావటానికి ఆస్కారం లేదు. ఎక్కడో ఉంటూ ఎక్కడో తిరుగుతూ పశువులకు కాటేస్తే మాకు సంబంధం లేదు. పశువుల కొట్టం వద్ద భద్రపరచుకునే బాధ్యత పశువుల యజమానులదే.

పరిశ్రమ జనరల్ మేనేజర్ రఘు

అక్షయపాత్ర అన్నం తినలేం..?

- విద్యార్థిని విద్యార్థులు
- అన్నం తెస్తుండ్రు గేటు కాడ పడేస్తుండ్రు.
- నీలా అన్నం.. పందుల పాలు



నవతెలంగాణ - బాలానగర్

ప్రభుత్వం కాంట్రాక్ట్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు సరఫరా చేస్తున్న అక్షయపాత్ర భోజనం తినలేక పోతున్నమని పాఠశాల విద్యార్థులు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల పరిధిలోని అప్పాచిపల్లి పాఠశాలలో స్థానిక విలేకరులకు కనిపించింపింది.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నామని తెలిపారు. గతంలో ప్రభుత్వం పాఠశాల విద్యార్థు లకు మధ్యాహ్న భోజనం సరఫరా కోసం అక్షయపాత్ర ద్వారా భోజనాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ మధ్య కాలంలో రాత్రి వండిన అన్నం పప్పు కూరగాయలను వండుతున్నారని తెలిపారు. వంటలు బాగా బాగాలేనందున 9 గంటల లోపలనే పాఠశాల గేటు ముందు భోజనం,పప్పుచారు, కూరగాయలను పడేసి వెళ్తున్నారని తెలి పారు. బాలానగర్ మండల పరిధి లోని37 గ్రామపంచాయతీలలో పాఠశాలలో సరఫరా చేస్తున్న అక్షయపాత్ర భోజనం పనితీరు. గుడికి ఉడకని అన్నం నీళ్లచారు తెచ్చి పాఠశాల తెరవక ముందే గేటు ముందల తెచ్చి పడేస్తున్న సంఘటన జరిగిందన్నారు. గతంలో పాఠశాల ఆవరణలోనే వంటవారు వండి విద్యార్థులకు జనాన్ని సరఫరా చేసేవారు. కానీ నేడు అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న భోజనం పాఠశాల విద్యార్థులు తినలేక పందులకు వేస్తున్నామని తెలిపారు.

ఘనంగా అక్షరాభ్యాసం



నవతెలంగాణ- మహమ్మదాబాద్

మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని మొట్టమొదటిసారిగా న్యూ బ్రిలియంట్ స్కూల్ లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.పురోహితులతో,ఉపాధ్యాయులతో, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అక్షరాలు దిద్దిస్తూ అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య,నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ చెన్నారెడ్డి, డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమ్మమాట- అంగన్వాడీ బాట

నవ తెలంగాణ -మహబూబ్‌నగర్

జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ కాలనీలో శుక్రవారం మొనప్పగుట్ట-3, క్రిస్టియన్ కాలనీ టీచర్లు అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ అంగన్‌వాడీ పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడి టీచర్లు ,మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ ,కమ్యూనిటీ ఆర్గనైజర్ దేవమ్మఆర్‌పిదివ్య,అంగన్‌వాడి టీచర్లు పద్మ, చంద్రకళ, కళారంజని, సువర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్పల్లిలో శ్రమదానం

నవతెలంగాణ - హన్వాడ

మండల పరిధిలోని పెద్దవారి పల్లి గ్రామంలో గ్రామ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం చేశారు. గ్రామ కార్యదర్శి రమాదేవి బీజేపీ మండల నాయకులు రఘురాం గౌడ్, అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు బుక్ కీపర్లు జీపి వర్కర్లు చెన్నై గౌడ్ మున్నూరు నర్సింలు రాధాకృష్ణ గౌడ్ తేజ బాలప్ప నరేష్ గౌడ్ విండోస్టెంట్ వెంకటేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయమా.. ఆటో పార్కింగ్ ..?

- ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలి: ప్రజలు
- ఎవరికి వారే యమునా తీరే..

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ మండల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఆటోల పార్కింగ్ ఏరియానా. మండల ప్రభుత్వ అభివృద్ధి కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆటోల పార్కింగ్ ఏరియాగా మారిపోయింది. ప్రభుత్వ కార్యాలయం చుట్టూ ప్రహరిగోడ లేకపోవడంతో ఆటోలు ఇతర వాహనాలు కు పార్కింగ్ ఏరియాగా మారిపోయింది.గతంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు. ఎంపీటీసీలు ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారే తప్ప ప్రహరీ గోడ ఏర్పాటు చేయలేకపోయారు. కార్యాలయాల వెనుక భాగాన చెత్తా చెదారం పేరుకుపోయిందన్నారు.గతప్రభుత్వ హయాంలో ప్రహరీ గోడ ఏర్పాటు చేయలేకపోయారు. ఈ ప్రభుత్వ హయాంలో ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రజలు తెలిపారు.



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మండల ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి



నవ తెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు మండలపరిధిలోని తూంపల్లి , కతేపల్లి , గ్రామంలో శుక్రవారం డ్రై డే సందర్భంగా పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి రామ సుబ్బారెడ్డి పర్యవేక్షించారు . ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిచో విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామాలలో కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అదేవిధంగా రేచింతల, గ్రామంలో కూడా డ్రై డే నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



వీపనగండ్ల : రైతుల పంట రుణమాఫీ సందర్భంగా మండల కేంద్రంలో తోపాటు సంగి నేనిపల్లి గ్రామంలో నిర్వహించే రైతు రుణమాఫీ సంబరాల్లో పాల్గొనేందుకు మంత్రి వచ్చిన సందర్భంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అంద జేశారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బాల్ రెడ్డి ,మండల నాయకులు మాజీ సర్పంచ్ మౌలాలీ మాట్లాడుతూ సింగోటం గోపాల్ దీన్నే రిజర్వాయర్ లింకు కెనాల్ లో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరాకు 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను, సిబ్బందిని భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. గోపాల్దిన్నె గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు రామచంద్రయ్య గౌడ్, సీహెచ్ వెంకటయ్య , ఆశన్న, ఈశ్వర్ , నాయకులు రాముడు ,ముత్యాలు రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించండి'



నవతెలంగాణ - పెబ్బేరు

ముదిరాజుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెబ్బేరు పురపాలక కేంద్రంలోని ముదిరాజుల సంఘం భవనం ముదిరాజుల సమస్యలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. బీసీ -డీలో ఉన్న ముదిరాజులను బిసి ఎల్లో చేర్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజుల సంఘం నాయ కులు గోనెల బాలస్వామి, సొప్పరిబీచుపల్లి, కురుమూర్తి, మహేష్, భీముడు, సహదేవుడు,లక్ష్మయ్య, సంగనమోని.శ్రీనివాసులు,బక్కన్న, గొడుగు శాంతన్న, బాలవర్ధన్, ఎల్లస్వామి, దేవిశ్రీప్రసాద్, కే.వినోద్ కుమార్, జి భాను పాల్గొన్నారు.

అనారోగ్యంతో .. వ్యక్తి మృతి

నవతెలంగాణ - మదనాపురం



మదనాపురం మండలంలోని శంకరమ్మ పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎరుకలి బుచ్చన్న అనారోగ్యంతో బాధపడుతు గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు గజ్జల నాగన్న శుక్రవారం నాడు నాయకులతో కలిసి మృతుడు బుచ్చన్న కుటుంబాని పరామర్శించారు. దహన సంస్కారణల కోసం గ్రామ నాయకుల సహకారంతో 3000వేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందించారు.అనంతరం ఓదార్పునిచ్చారు.వీరి వెంట కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డే కృష్ణ,గ్రామ అధ్యక్షులు కృష్ణయ్య,కురుమూర్తి,శ్రావణ్ కుమార్, రాజు, బాలరాజ్, శ్రీనివాసులు, గుగ్గిళ్ళ రంగన్న, శేషన్న తదితరులు ఉన్నారు.

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **ఏకకాలంలో రుణమాఫీ కాంగ్రెస్‌దే..**
- **రైతు సంబరాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్**



నవతెలంగాణా - మదనాపురం

తెలంగాణ రాష్ట్రంలో రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మదనాపురం మండల కేంద్రంలో రైతులతో కలిసి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో భారీ ర్యాలీని చేపట్టి, బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్లో కాంగ్రెస్ పార్టీ సారదుడు రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన హామీని ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సమక్షంలో ఏకకాలంగా రుణమాఫీని చేసిందన్నారు.ఇప్పటికే గ్యారంటీలలో ఉచిత బస్సు,500కే సిలిండర్,పది లక్షల ఆరోగ్య శ్రీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఆగస్ట్ పదిహేనవ తేదీ వరకు అందరికీ 2లక్షల రుణమాఫి వర్తిస్తుందని వెల్లడించారు. బీఆర్ఎస్‌వారు మతిభ్రమించిన మాటలు మాట్లాడటం హాస్యస్పదమన్నారు. గత ప్రభుత్వంలో రైతుల కంట్లో మట్టి కొట్టి ఇప్పుడు ఒలకబెట్టిన మాటలు వివరిస్తున్నారని ఎద్దేవా చేశారు.మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతులను తప్పుదోవ పట్టిస్తు న్నారని అలాంటివి నమ్మొద్దని సూచించారు. అభిప్రాయ సేకరణ పూర్తవగానే రైతు బరోసా డబ్బులు ఖాతాలో వేస్తామన్నారు.అనంతరం నాయకులతో కలిసి రైతుల పంట పొలాల్లో కూలీలతో కలసి జిఎంఆర్ వరి నాట్లు వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గజ్జల నాగన్న ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షులు వడ్డే కృష్ణ,జిల్లా నాయకులు రామచంద్రయ్య, వేమన్న,సత్యశీల రెడ్డి,శరత్ రెడ్డి, నాగన్న యాదవ్,వడ్డే రాములు,రవీందర్ రెడ్డి,వాకిట సత్యం,మనివర్ధన్ రెడ్డి,తిరుపతి రెడ్డి,అక్కల మహదేవన్ గౌడ్, రాజవర్ధన్ రెడ్డి,విజయ్ తూము,మహేందర్ నాయుడు,దంతనూర్ వెంకటన్న,ఆయా గ్రామాల నాయకులు,రైతులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం '

నవతెలంగాణ - పెబ్బేరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని అధికారికంగా 9వ వార్డ్ (అంబేద్కర్ నగర్)లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ప్రబలే సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఇ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, కౌన్సిలర్లు అశ్విని సత్యనారాయణ, పద్మ వేణు యాదవ్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ యోగేష్ బాబు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సగం రుణమాఫీతో ఆర్భాటాలు

నవతెలంగాణ- వనపర్తి రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు నిధులను రైతు రుణమాఫీకి మళ్లించి రైతులను మభ్యపెడుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ,వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సగం రుణమాఫీతో ఆర్భాటాలు సంబరాలు చేసుకుంటున్నారని మోసానికి పెట్టింది పేరు కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్బాలు పలికి రైతు భరోసా ఎగ్గొట్టి, ఒక లక్ష వరకు మాత్రమే రుణమాఫీ రూ.6000 కోట్లతో చేశారని , ఇది రైతులను మోసం చేయడమే అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ పై రైతన్న మభ్యపెడుతుందని రూ.6000 కోట్లతో రుణమాఫీ అవుతుందా అని ప్రశ్నించారు. యాసంగి లో రైతు బంధు 2000 కోట్లు వేయకుండా వాటిని ఎగ్గొట్టి వానాకాలం రైతుబంధు గురించి పట్టించుకోవడంలేదని అన్నారు. దీని ద్వారా రైతులకు ఎకరాకు రూ.7500 చొప్పున పదివేల కోట్లు ఎగ్గొట్టారని , కోటి 73 లక్షలు మహిళలకు రూ. 2500 చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడిందని , కౌలు రైతులకు ఇస్తామన్నా రైతు బంధు కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని, కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఒకే సమయంలో రైతుబంధు, రైతు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు నెలకు రెండు వేల చొప్పున ఇస్తామన్న హామీని నిరుద్యోగులకు 4000 చొప్పున ఇస్తామన్నటువంటి హామీని భూమిలని కౌలు రైతులకు 15000 చొప్పున 62 40 కోట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా వరి ధాన్యంపై 6500 కోట్ల బోనస్ లను ఎగ్గొట్టి కేవలం 6000 కోట్లతో ఒక లక్ష రుణమాఫీ చేసి చేతులు దులుపుకుంటున్నారని వారన్నారు ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, సింగిల్ విండో ప్రెసిడెంట్ వాసుదేవ్ రెడ్డి ,స్టార్ రహీం ,యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు : మంత్రి జూపల్లి



నవతెలంగాణ - వీపనగండ్ల

ప్రజా పాలనలో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు మండల కేంద్రంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడుతూ మండలంలో 5500 మంది రైతులకు బోరు బావులకు కరెంటు కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. కరెంటు కనెక్షన్‌లో విద్యుత్ అధికారులు, రైతుల నుంచి, రెవెన్యూ శాఖలో రెవెన్యూ అధికారులు డబ్బులు, లంచాలు ఏ అధికారులైనా తీసుకున్నట్లయితే ప్రజలు, రైతులు తన దృష్టికి తీసుకురావాలని, తన నెంబర్ కు ఫోన్ చేయాలని అలాంటి వారిపై చర్యలు చేపడతామని అన్నారు. విద్యుత్ కాంట్రాక్టర్లు ఎస్టిమేషన్ లో ఉన్నట్లు పనిచేయకుండా రైతుల తోటి దిమ్మెలు కట్టించి డబ్బులు డ్రా చేసుకోవడం జరుగుతుందని అలా చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. రెవెన్యూ శాఖలో తరాల నుంచి రికార్డులలో సాగులో ఉన్న వాటిని భూములను పూర్వాపరాలను పరిశీలించి భూ సమస్యలు లేకుండా అధికారులు సరి చేయాలని సూచించారు. భీమా, జూరాల కాలువలో లో సమస్యలు పరిష్కరించి సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి తిరిగి వాటిని ఏమైనా అంచనాలు వస్తే అధికారులు అంచనా వేసి ఇవ్వాలన్నారు.గత పది సంవత్స రాలలో బీఆర్ఎస్ నియంతల వ్యవహరించి రాష్ట్ర అభివృద్ధి లో కొంతమంది మాత్రమే అభివృద్ధి చెందారని, రాష్ట్ర అభివృద్ధి విస్మరిం చారని తిరిగి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు.ప్రభుత్వ హయాంలో ప్రజా పాలన అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ,అవినీతికి ఆస్కారం లేకుండా పాలన కొనసాగించడం జరుగుతుందన్నారు. అనంతరం కస్తూబా గాంధీ పాఠశాలను పరిశీలించి సమస్యలను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్ ఐ కురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రాఘవేందర్, పీఆర్ ఏ మెహర్ తే జ, మాజీ మం డల రైతు బంధు అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య యాదవ్, నారా యణరెడ్డి ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు ఇంద్ర కంటి వెంకటేష్, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో నిర్వహించే సంబరాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలులో భాగంగా రైతు రుణమాఫీ సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు అప్పులపాలయ్యారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంబడే ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. లక్ష లోపు ఉన్న ఉన్నవారికి డబ్బులు జమ చేయడం జరుగుతుందని, లక్షన్నర ఈనెల చివరికల్లా, 2 లక్షలు వచ్చే నెల 15 కల్లా రుణం మాఫీ చేయడం జరుగుతుందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఎంతమంది బదిలీపై వెళ్లారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బదిలీపై వెళ్లే వారిని అప్పుడే రిలీజ్ చేయకుండా, కొత్తగా వచ్చేవారు జైన్ అయిన తర్వాత రిలీవ్ చేయాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య యాదవ్, నారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డాక్టర్ గోదల బీరయ్య యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి రఘునాథ్ రెడ్డి, నాయకులు రామ్ రెడ్డి, చిన్నారెడ్డి ,ధనుంజయుడు, మీసాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం మాట ఇస్తే నిలబెట్టుకుంటాం

- **ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి సుడిగాలి పర్యటన**
- **కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
- **ఎనిమిది కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

నవతెలంగాణ - పెబ్బేరు

గత టిఆర్ఎస్ పార్టీల మాటల ప్రభుత్వం కాదని మాది చేతల ప్రభుత్వమని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు పురపాలక కేంద్రంలో సుడిగాలి పర్యటన చేశారు. కొద్ది సమయం లోనే 8 కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా దేశ నేత రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోనియా గాంధీ సూచన మేరకు రైతాంగానికి ఇచ్చిన రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మాటలు చెప్పి లక్షల కోట్లు అప్పులు చేసి ఖజానా ఖాళీ చేసిన సర్దుబాటు చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. పింఛన్ల పెంపు, మహిళలకు 2500 సహాయం తప్ప మిగిలిన కార్యక్రమాలు పూర్తి చేశామని వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రజల వాగ్దానాలను అమలు చేస్తున్నాం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సహకరించాలి అన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు స్పందించాలి ఎమ్మెల్యే మెగా రెడ్డి

పెబ్బేరులో చరిత్ర కలిగిన ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు స్పందించాలని ఎమ్మెల్యే మెగారెడ్డి పిలుపునిచ్చారు. పాఠశాలను సందర్శించి అభివృద్ధి కోసం తనవంతుగా రెండు లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే తో పాటు పెబ్బేరు కు చెందిన పూర్వ విద్యార్థి కాంగ్రెస్ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాలు అదనపు గదుల నిర్మాణాలకు పూర్వ విద్యార్థులు సహకరించాలి అన్నారు.



మత్స్య కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే..

పెబ్బేరు సమీపంలో ఉన్న మత్స్య కళాశాలను ఎమ్మెల్యే మెగా రెడ్డి సందర్శించారు. నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న చేపల కొలను లను సందర్శించి వాటి పెంపకం, తీసుకునే జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఉపాధ్యాయ బృందం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్లాట్ల వినియోగదారులకు న్యాయం చేస్తాం ..

పెబ్బేరు శివారులో ఉన్న 458, 545, 555 సర్వే నంబర్లలో ఉన్న రైతుల భూమి ప్లాట్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చారు. స్వయంగా భూమిని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఓ ఆర్ సి ప్రక్రియ మొదలు పట్టిన ఆర్డీవో తో ఫోన్లో మాట్లాడారు చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేయాలన్నారు. పై అధికారులతో స్వయంగా మాట్లాడి రైతులకు ప్లాట్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్లాట్ల లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ కు సన్మానం..

పెబ్బేరు పట్టణానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ కూతురు ప్రశాంతి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం సాధించడంతో స్వయంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి వారి ఇంటికి వెళ్లి ప్రశాంతిని శాలువా పూలమాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా స్రవంతి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ దేవత గుడి అభివృద్ధికి సహకరిస్తా..

పెబ్బేరు పురపాలక కేంద్రంలోని గ్రామదేవత సుంకులమ్మ గుడి అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే మెగారెడ్డి అన్నారు. గుడిలో కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే గుడి నిర్మాణం దాతల సహకారంతో చేస్తున్నామని మీ సహకారం కావాలి అని గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా గుడి ప్రాంగణమంతా సీసీ నిర్మాణం, స్టోర్ రూమ్, గుడి పన శిఖరమునకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీర్ల చావిడిని సందర్శించిన ఎమ్మెల్యే..

పెబ్బేరు పురపాలక కేంద్రంలోని పీర్ల చావిడిని ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న పీర్ల చావిడి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. జార్తుల సందర్భంగా పీర్ల చావిడి దగ్గర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు పురపాలకవర్గం వినతి

పెబ్బేర్ పట్టణంలోని వనపర్తి రహదారి రోడ్డు నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం పనులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ పాలకవర్గం ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డికి వినతి పత్రం అందించారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని ఇల్లు తొలగించాల్సి ఉందని వాటితో పటు రోడ్డు డ్రైనేజీ నిర్మాణాలను త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. పనులు ప్రారంభిం చామని తొందరలోనే పూర్తిస్థాయిలో పనులు ప్రారంభ మవుతాయని ఎమ్మెల్యే వారికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయి, వైస్ చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, సుమతి ఎల్లయ్య పద్మా వేణు, తదితరులు ఉన్నారు.

కొద్ది సమయం లోనే 8 కార్యక్రమాలలో ఎమ్మెల్యే

పెబ్బేరు పురపాలక కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి కొద్ది సమయంలోనే ఎనిమిది కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో రవీందర్, కౌన్సిలర్లు ఎల్ల స్వామి, అశ్విని సత్యనారాయణ, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సురేందర్ గౌడు, వెంకటేష్ సాగర్, రంజిత్ కుమార్, భాను ప్రకాశ్ రెడ్డి, దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, వీరస్వామి నాయుడు, రాము గౌడు, నరసింహనాయుడు, రామ్ రెడ్డి, సత్యానారాయణ రెడ్డి, షకీల్, మల్లేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన

వనపర్తి రూరల్ :ప్రజలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా ఎస్పీ ఆర్ గిరిధర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ డిఎస్పి రత్నం మదనాపురం ప్రభుత్వ హైస్కూల్ నందు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి మీ అకౌంట్ కు సంబంధించి వచ్చేటటువంటి ఫోన్ కాల్స్ ని నమ్మవద్దని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ వివరాలను అడిగితే వారికి చెప్పవద్దని, మిమ్ములను మోసపుచ్చేందుకై మీకు లాటరీ తగిలిందని మీ అకౌంట్ కు సంబంధించిన వివరాలు తెలపండి అనేటటువంటి మాటలను నమ్మవద్దని, మీ ఆధార్ కార్డు, క్రెడిట్ కార్డు మీ బ్యాంకు అకౌంట్ ,అప్డేట్ అవ్వలేదని మీ అకౌంట్ ను క్లోజ్ చేస్తున్నామని అనేటటువంటి ఫోన్ కాల్స్ వస్తే వాటిని నమ్మవద్దని, వారికి భయపడి డబ్బులు పంపవద్దని వారన్నారు, మీ పేరుపై పార్సిల్ వచ్చిందని, ఎవరైనా మిమ్ము ను బెదిరింపులకు గురి చేసినట్లయితే, డబ్బులు పంపమని బెదిరింపులకు గురి చేసినట్లయితే ఎవరికి డబ్బులు పంపవలసిన అవసరం లేదని వాటిని నమ్మరాదని, మేము సైబర్ క్రైమ్ పోలీసులం మీరు సైబర్ క్రైమ్ చేశారు మీపై సైబర్ కేసు నమోదు చేస్తున్నాము అనేటటువంటి వీడియో కాల్స్, ఫోన్ కాల్స్ ను నమ్మరాదని వారన్నారు అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టినటువంటి రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్తులు ఏదో బ్యాంకు పేరిట వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు , పిక్చర్ ల తో బ్యాంకు లోగోలతో వాట్సఅప్ యాప్ లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని దానిని మనం యాక్సెప్ట్ చేసినట్లయితే మన సమాచారం అంతా వారి కంట్రోల్ లోకి వెళుతుందని, మన ఫోన్లో ఉన్న డాటా మొత్తం వారి గుప్పట్లో ఉంటుందని అన్నారు. గూగుల్ పే ,ఫోన్ పే, యూపీఐ ద్వారా డబ్బులు దోచేస్తుంటారని తెలిపారు. ట్రేడింగ్ లో ఉన్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారని , ఏదైనా ఏపీకే ఫైల్స్ వచ్చినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదని వారు తెలిపారు ఒకవేళ మీ వాట్సాప్ పనిచేయకుంటే వెంటనే రీ ఇన్స్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్లో రిపోర్టు చేయాలని ఎవరైనా ఏదైనా నేరానికి గురి అయిన ట్లయితే వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా 1930 కి కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in లో రిపోర్ట్ చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనాపురం పోలీస్ సిబ్బంది స్కూల్ విద్యార్థులు ప్రిన్సిపాల్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ,పార్కు నిర్మాణాలకు ప్రతిపాదనలు : ఎమ్మెల్యే

నవతెలంగాణ - పెబ్బేరు

శ్రీరంగాపురం మండలంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి నుంచి విద్యాపర్తిగా ఎంతో ప్రాశస్త్యం కలిగిన వనపర్తి నియోజకవర్గం ప్రస్తుతం నిరుద్యోగుల పాలిట వర ప్రధాయినిగా మారుతుందని చెప్పవచ్చు. ఉన్నత చదువులను అభ్యసించి ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులను, నిరుద్యోగలను దృష్టిలో ఉంచుకొని వనపర్తి నియోజకవర్గ పరిధిలో రూ. 22 కోట్లతో ఐటీ టవర్ నిర్మాణానికి శ్రీరంగాపురం మండలం కంబల్లాపురం, తాటిపాముల గ్రామ శివారులలో 600 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణాలకు సంబంధిత శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందుకు సానుకూలంగా స్పందించిన వారు వనపర్తి నియోజకవర్గ పరిధిలో చేపట్టే నిర్మాణాలను వేగవంతంగా మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల అభివృద్ధిలో రాష్ట్రస్థాయిలోనే ముందు వరసలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

పోస్టల్ కార్యాలయాల ఎదుట నిరసన ..

వనపర్తి రూరల్ :కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదా సీన వైఖరికి నిరసనగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మికులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఎన్ ఎఫ్ పీ ఈ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు ఇప్పటికే జరిగి ఉంటే జనవరి 2026 నుంచి కొత్త వేతనాలు పొందే అవకాశం ఉండేదని, వేతన సంఘం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తన వ్యతిరేక వైఖరిని ఇప్పటికే చట్టాసభ లలో వెల్లడించిందని ఉద్యోగు హక్కుగా పొందాల్సిన 18 నెలల కరువుబత్యం ఓ కలగా మిగిలిపోయిందని అన్నారు. కార్మిక హక్కులను కాలరాయాలన్న దుస్సంకల్పంతో తపాలా శాఖలో అతిపెద్ద సమైక్య అయిన ఎన్ ఈ పీపీ ఈ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కొరకు మనం ఎంతైనా పోరాటం చేయవలసిన అవసరం ఉందని ఎనిమిదవ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని ,నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 18 నెలల కరువు బత్యం వెంటనే చెల్లించాలని, పూర్తి పెన్షన్ 15 సంవత్సరాలకు బదులుగా 12 సంవత్సరాలకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
శనివారం | జూలై 20, 2024 | www.navatelangana.com

జిల్లా కేంద్రంలో డ్రగ్స్‌పై డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు



నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

జిల్లా కేంద్రంలో డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్ కోసం డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీ చేశామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డీజీపీ సూచనలతో జిల్లా పోలీసులు, ఆర్ఐ జగన్ ఆధ్వర్యంలో డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్ నిర్మూలన చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో రిజర్వ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేశామని ఎస్పీ తెలిపారు. యువ సమాజం భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ముందస్తుగా తనిఖీలు చేపట్టి సాధ్యమైనంత మేరకు డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రయత్నాలు కొనసాగిస్తు న్నామన్నారు. గత నెల జూన్ 26 రోజున యాంటీ డ్రగ్స్ డేను కలెక్టర్‌తో కలిసి ర్యాలీ నిర్వహించి, జిల్లాలో ఉన్న యువత అందరికీ డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్ వాడితే వచ్చే అనర్థాల గురించి జిల్లాలోని ముఖ్యమైన కూడలిలో వివరించామన్నారు. అలాగే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి తమ కొడుకులను గమనిస్తూ, వారికి మంచి భవిష్యత్తును అందియాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలననే ధ్యేయంగా పనిచేస్తామని అభిప్రాయపడ్డారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాదావత్ సంతోష్ బాధ్యతలను ఈనెల 4న స్వీకరించిన తర్వాత శుక్రవారం మొదటిసారి జడ్పీ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. జడ్పీ పాలకవర్గం పదవి కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రత్యేక అధికారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గోపాల్ నాయక్, కలెక్టర్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఛాంబర్‌లో జడ్పీ సీఈఓతో కలెక్టర్ సమావేశమయ్యారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, జిల్లా పరిషత్ పరిధిలోని అత్యవసరమైన పనులను పెండింగ్‌లో పెట్టకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి సిబ్బందితో పరిచయం చేసుకొని సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్ లోని పలు శాఖల డివిజనల్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. కార్యాలయం ఆవరణలో విద్యుత్ దీపాలు లేవని, తాగునీటి సమస్యతోపాటు, పారిశుద్ధ్య పనులు జరగటంలేదని పలువురు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పారిశుద్ధ్య పనులు పురపాలక సిబ్బందితో చేయించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ దీపాలతో పాటు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గోపాల్ నాయక్, పర్యవేక్షకులు యూసుఫ్, తదితరులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ...



బిజినపల్లి : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ శుక్రవారం కస్మికంగా తనిఖీ చేస్తున్న సమయంలోనే సాంఘిక గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి తల్లి పెద్దాపురం నుండి తన కొడుకును చూసేందుకు రెండేళ్ల ఆమె మనుమడు సహస్రతో కళాశాలకు వచ్చిన సందర్భంగా ఆ బాలుడికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో బిజినపల్లి ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అదే సమయంలో కలెక్టర్ అక్కడే ఆస్పత్రి తనిఖీ చేస్తూ విద్యార్థిని గమనించి వివరాలు అడగగా తన అక్క కొడుకుకు ఫిట్స్ రావడంతో ఇక్కడికి తీసుకొచ్చామని తెలిపాడు. జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ నిర్వహించి వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదే సమయంలో అందుబాటులో ఉండాల్సిన అంబులెన్స్ గంగారం వెళ్లడంతో బిజినపల్లి ఎమ్మార్వో కారులో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడ చికిత్స అందించేందుకు బాలుడి వెంట వైద్య సిబ్బందిని పంపించారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ వెయ్యి రూపాయల నగదును ఆ మహిళకు అందజేశారు. పూర్తి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి సూపరింటెం డెంట్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలి : కలెక్టర్

నవతెలంగాణ-బిజినేపల్లి

విద్యార్థులు ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకొని మంచి విద్యను నేర్చుకొని జీవితంలో రాణించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ఇంటర్మీడియట్ ఎంపీసీ, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉన్నాయా, బోధన ప్రమాణాలు పాటిస్తున్నారా, అలాగే నెలవారి బోధనా అంశాలు సరిగా పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, తదితర అంశాలను ప్రిన్సిపాల్ సునీతతో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఐదో తరగతి నుండి ఇంటర్ వరకు 570 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని, వసతి గృహంలోని పలు సమస్యలను ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం డైనింగ్ హాల్‌లో విద్యార్థులతోపాటు కలెక్టర్ భోజనం చేశారు. మధ్యాహ్న భోజనంలో ఆకుకూర పప్పు, గుడ్డు పులుసు, సాంబార్ శుక్రవారం మధ్యాహ్నం మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీరాములు, పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి ఉన్నారు.



రైతులను రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నవ తెలంగాణ-అచ్చంపేట

రాష్ట్ర రైతులను రాజులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలో ఎద్దుల బండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మొదటగా లక్ష రుణం ఉన్న రైతులకు వారి ఖాతాలలో జమ చేశామని, త్వరలోనే రెండు లక్షలు ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామన్నారు. రైతు సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి అంకితభావంతో పని చేస్తున్నారని, గ్రామాలలో రైతులు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. రూ.31వేల కోట్లు ప్రభుత్వంపై భారం పడినప్పటికీ రైతుల సంక్షేమం కోసం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. జిల్లా తరఫున అచ్చంపేట నియోజకవర్గం తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గార్లపాటి శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, న్యాయవాది రాజేందర్, మాధవరెడ్డి, కాశన్న యాదవ్, ఉన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-పెంట్లవెల్లి

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రజా సమస్య లను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్ర వారం రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి కృష్ణా రావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పెంట్లవెల్లి మండల కేంద్రంలో గత 16ఏండ్ల క్రితం ఇళ్ల స్థలాల కోసం 14 ఎకరాల 34 గుంటల భూమినీ ప్రభుత్వం కొను గోలు చేసిందని, జటప్రోల్ గ్రామంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఈ భూములను పేదలకు పంచాలని వారు మంత్రిని కోరారు. పెంట్లవెల్లి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని అలాగే చిన్నంబావి, కొప్పు నూరు, జటాప్రోల్ గ్రామాల మధ్యలో నాపరాతి గనులు ఉన్నాయని, వాటికి అనుగుణంగా సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశా లు కల్పించలని వారన్నారు. కొండూరు, సంపత్రావ్ పల్లి, సింగవరం, గోప్లాపూర్, జటప్రోల్, పెద్దమారు, చిన్నమారు గ్రామాల రైతుల చివరి ఆయకట్టుకు నీరురాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగోటం, గోపాల్ దీన్నే రిజర్వాయర్ ద్వారా రైతుల కు సాగునీకి అందించాలని వారు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పి.నరసింహ, కొల్లాపూర్ మండల కార్యదర్శి శివ వర్మ, పెద్దపల్లి మండల కార్యదర్శి దశరథం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరు

- జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రకళ
- ఛలో హైదరాబాద్‌కు తరలిన అంగన్వాడీ ఉద్యోగులు



నవతెలంగాణ - తెలకపల్లి

అంగన్వాడీ ఉపాధ్యాయుల, ఆయాల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు పోరు చేస్తామనీ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసోజు చంద్రకళ అన్నారు. శుక్రవారం మండలంలో గల అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఛలో హైదరాబాద్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని 65 సంవత్సరాలు పైబడిన టీచర్స్‌కు రెండు లక్షల రూపాయలు, హెల్పర్స్‌కు లక్ష రూపాయలు చెల్లించాలని వారు రిటైర్మెంట్ తర్వాత ప్రస్తుతం ఇస్తున్న వేతనంలో సగం వేతనం నెలవారీగా పింఛన్ ఇవ్వాలన్నారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాడ్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్నామని మా సమస్యలు పరిష్కరించకపోతే ప్రగతి భవన్ ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ రైతు సంఘం నాయకులు గోపాస్ లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్లు అలివేలమ్మ, తిరుపతమ్మ, లక్ష్మి, జయవేగం, లక్ష్మీకాంతమ్మ సుకన్య, ఆయాలు, టీచర్లు పాల్గొన్నారు.

చినుకు పడితే చీకటే..

- సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



నవతెలంగాణ - తిమ్మాజీపేట

మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం మండలంలోని గొరిట గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకొని తమ గ్రామానికి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ కావాలని గంటపాటు ధర్నా నిర్వహించి గొరిట, బాజీపూర్, చేగుంట గ్రామాలకు సరఫరా నిలిపివేసి సబ్ స్టేషన్‌కు తాళం వేశారు. ఈ సందర్భంగా ఏఈ, డీఈ డాండాం అని నినాదాలు చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చినుకు పడితే మా గ్రామమంతా చీకటి మారుతుందని తమ పిల్లలు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే వరిపంట వేసుకోవడానికి కారియట సిద్ధంగా చేసుకోవడానికి కరెంటు సరఫరా లేకపోవడంతో తమ పొలాలకు నీళ్ల రావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ప్రసంగాలకు క్షేత్రస్థాయి ఆచరణకు ఎక్కడ పొంతనం కుదరడం లేదు తమది రైతు ప్రభుత్వం మనీ రైతు సంక్షేమమే తమ ఎజెండా అని వేదికల మీద ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అధికార పార్టీ పెద్దలకు విద్యుత్ కోతలు కనపడడం లేదన్నారు. వ్యవసాయానికి అనుగుణంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కావడం లేదు. రోజుకు కొద్ది గంటలు మాత్రమే కరెంటు సరఫరా అవుతుందని 24గంటల విద్యుత్ సరఫరా అవుతుందని ఆశతో రైతులు పెద్ద ఎత్తున వారితోపాటు కూరగాయల పంటలు సాగు చేశారు. అత్యధిక మంది రైతులు పెద్ద ఎత్తున వరిపంటను సాగు చేశారు. రోజుకు కొన్ని గంటలు మాత్రమే సరఫరా అవుతున్న విద్యుత్ వల్ల రాత్రుళ్ళు వ్యవసాయ బోరు బావుల వద్ద పడిగాపులు కాయాల్సి పరిస్థితి మళ్లీ నెలకొంది పాలకులు సంబంధిత అధికారులు స్పందించి నిరంతర విద్యుత్ అందజేయాలని, తమ పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు. విద్యుత్ అధికారి రైతులతో మాట్లాడి ఇప్పటి నుంచి నిరంతరం కరెంటు ఇస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు భాస్కర్ రెడ్డి, గాలి రాజు, చెన్నయ్య గడ్డం రాములు, శ్రీహరి, ఆంజనేయులు, వెంకటయ్య శేఖర్, వారితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎలాంటి అధికారిక విద్యుత్ కోతల్లేవు

- జిల్లా విద్యుత్ అధికారి లీలావతి

నవతెలంగాణ -కల్వకుర్తి

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎలాంటి అధికారిక విద్యుత్ కోతలు అమలు కావడంలేదని జిల్లా విద్యుత్ అధికారి లీలావతి తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఊరుకొండ మండలంలోని జకినాలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి విద్యుత్ వైర్ అర్ధరాత్రి తెగిపోవడం వల్ల విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడిందని ఆమె తెలిపారు. మరునాడు ఉదయమే సిబ్బంది స్పందించి మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరిద్ధరించడం జరిగిందని ఆమె వివరించారు. గత ఆరు నెలల క్రితం కంటే ప్రస్తుతం వ్యవసాయంతో పాటు గృహ వినియోగదారులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఆమె వివరించారు. ఎక్కడైనా సమస్య తలెత్తినప్పుడు సంస్థ సిబ్బంది మరమత్తుల కోసం విద్యుత్ సరఫరా కొద్ది సేపు నిలిపివేస్తున్నారని ఆమె అన్నారు.

కొంతమంది ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరా విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వర్షాకాలం కావడం వల్ల సంస్థ సిబ్బంది అప్రమత్తం గా ఉండి నిరంతరంగా విద్యుత్ సేవలందిస్తున్నారన్నారు.

యాగ హోమాలతో సంపూర్ణ ఆరోగ్యాలు : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కందనూలు

జిల్లా కేంద్రంలో శ్రీ కృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాగ హోమాలతో సుభిక్షం సంపూర్ణ ఆరోగ్యాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే డాక్టర్ సరిత రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం చండీ హోమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక అన్నదానం చేశారు. భక్తులతో కలిసి భోజనం చేశారు అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించేందుకు చేపట్టిన అయుత చండీ యాగం దిగ్విజయంగా పూర్తి చేసుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

శేర్లింగంపల్లి డీఎంహెచ్ఓగా డా.కె.సుధాకర్ లాల్



కందనూలు : సాధారణ బదిలీలలో భాగంగా నాగర్‌కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.కె.సుధాకర్ లాల్ శేలింగంపల్లి, హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వరాజ్య లక్ష్మి నాగర్‌కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా సాధారణ బదిలీ అయ్యారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

- మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



నవ తెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన రైతులను రుణమాఫీ సంబరాలకు శుక్రవారం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, సీనియర్ నాయకులు సర్పంచులు మాట్లాడుతూ పేదలకు న్యాయం జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే ఎలక్షన్లో రాహుల్ గాంధీ 6 హామీలను ఇచ్చారని, ఇప్పటికే కొన్ని హామీలు నెరవేర్చారని వాటిలో ముఖ్యంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇచ్చిన ఘనత ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండలం కాంగ్రెస్ అధ్యక్షులు తగిలి కృష్ణయ్య, మేకల చంద్రయ్య, మాజీ ఎంపీపీ వరద రాజుల వెంకటేశ్వర్ రావు, మండలం మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు లోకినేని లక్ష్మణరావు, మాజీ ఎంపీ టీసీలు డి.రవికుమార్, బద్యానాయక్, ధర్మేందర్, ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, పగడాల చిన్నయ్య, డాక్టర్ కురుమూర్తి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, సింగిల్ విండో మాజీ చైర్మన్ డి.బాలస్వామి, సీనియర్ నాయకులు తగిలి బాల స్వామి, భీరం సుదర్శన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు మశన్న, పబ్బతి అజయ్ కుమార్, మేకల మల్లేష్, సింగల్ విండో డైరెక్టర్‌లు దండు చంద్రయ్య, కవి గాయకుడు గాదరి చంద్రశేఖర్, దాసరి బిచ్చిరెడ్డి, డబ్బ ఎల్లయ్య, రాముడు, జంగం నాగరాజు, ముష్టిపల్లి శ్రీనివాసులు, బొల్లె ఈశ్వరయ్య, బెట్టరీ నాగరాజు, జొన్నల బొగడ రాజు, ఎం.తిరుపతయ్య, గులాం రసూల్, అశోక్ రెడ్డి, యువ నాయకుడు నాగబాబు, సల్వాది వెంకటయ్య పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ హర్షనీయం

- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్

నవతెలంగాణ-తాడూరు

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అతి కొద్ది కాలంలోనే రైతుల పట్ల చిత్తశుద్ధితో రైతులను రైతు రుణమాఫీకి పూనుకోవడం హర్షనీయమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనతికాలంలో మాట నిలబెట్టుకోవడం రైతు రుణమాఫీ చేయడం అర్హనీయమన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన దళితుల హామీలను అమలు చేయాలని కోరారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ అందరికి వర్తింపచేయాలని అలాగే అటవీ భూములు సాగు చేసుకుంటున్నా గిరిజన చెంచు చెంచులకు హ్యాపీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను పెంచి వృద్ధులు, వితంతులు, వికలాంగులను ఆదుకోవాలని ఆ మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



రూ.18వేల వేతనం ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-అచ్చంపేట

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆ సంఘం నాయకురాలు రజిత డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గత 20 ఏళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు పరీక్ష ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చినట్టుగానే ఆశా వర్కర్ల వేతనాలు ప్రతినెల ఐదో తారీకు లోపు వారి అకౌంట్లో జమ చేయాలని కోరారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులతో వేతనం కూడిన ప్రభుత్వం ఇవ్వాలని, 6 నెలలతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఛలో హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివలీల, మణెమ్మ, లక్ష్మి, నిర్మల, కల్పన, సుజాత, అలివేల, బాలమణి పాల్గొన్నారు.

చౌటబెట్ల గ్రామ అభివృద్ధే ధ్యేయం

- కమలాకర్ రావు, వంగ రాజశేఖర్ గౌడ్



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

ఫ్రైడే, డ్రైడే సందర్భంగా శుక్రవారం కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు చౌటబెట్ల గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాంగ్రెస్ సీనియర్ నాయకు లు కమలాకర్ రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రధాన అనుచరులు వంగ రాజశేఖర్ గౌడ్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి శుద్ధమైన తాగునీరు అందుతుందా లేదా ఎమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. త్వరలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

22న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల కేంద్రంలో గౌడ సంఘం జిల్లా నాయకుడు వంగ రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తాలూక గౌడ సంఘం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహా ఆవిష్కరణ గౌడ సంఘం జిల్లా నాయకుడు సూర్య ప్రతాప్ గౌడ్ ఆధ్వర్యంలో చేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, గౌడ సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లా గౌడ సంఘం నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వెంకట స్వామి గౌడ్, పట్టపర్ల శ్రీనివాస్ గౌడ్, గోవింద్ గౌడ్, సుదర్శన్ గౌడ్, సాయికృష్ణ గౌడ్, రామకృష్ణ గౌడ్, మధుసూదన్ గౌడ్, శివన్న గౌడ్, యాదగిరి గౌడ్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడు మృతి



నవతెలంగాణ-పెంట్లవెల్లి

మండల పరిధిలోని గోపులాపురం గ్రామంలో మృత్యు ఘటన చోటు చేసుకుంది. గురువారం పీర్ల పండుగ చివరి రోజు ఊరేగింపులో భాగంగా సంబరాలు నిర్వహిస్తుంటే వనపర్తి నుంచి కొల్లాపూర్ వెళ్తున్న కొల్లాపూర్ డిపో బస్సు కిందపడి తూర్పాటి సత్యాలు (25) మృతి చెందాడు. యువకునికి చిన్నప్పటి నుంచి శారీరక దృఢత్వం లోపించడం, మతిస్థిమితం లేకపోవడం వలన ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

'ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని ప్రకటించాలి'



నవతెలంగాణ-తిమ్మాజిపేట

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డిఏలను వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీ ఎఫ్ తిమ్మాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల కమిటి తరపున సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎండి. నసీర్, ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ పీఆర్సీ పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయ పోస్టులకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని వారు కోరారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో మౌళిక వసతులను కల్పించి పాఠశాల పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదులో కేటీఎఫ్ నాయకులు ఏ.లక్ష్మణ్, రాములు, రాధాకృష్ణ, కుర్మయ్య లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

లైన్ మెన్ స్పందించట్లేదని ఏఈకి వినతి



ఉప్పునుంతల : మండల కేంద్రంలోని విద్యుత్ కేంద్రం వద్ద విద్యుత్ కరెంటు సమస్యలపై విద్యుత్ ఏఈ అమర్ సింగ్‌నీ కలిసి తమ సమస్యలపై మండల కేంద్రానికి విధులు నిర్వహిస్తున్న ఫీడర్ లైన్ మెన్ మూడావత్ శ్రీను సకాలంలో స్పందించటం లేదని గ్రామ ప్రజలు రైతులు లైన్ మెన్ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నాడని రైతులు చింతగాల్ల శ్రీను, బలరాం, చింతగాల్ల శ్రీను, కృష్ణయ్య, యాదయ్య, పర్వతాలు, శుక్రవారం ఏఈకి సబ్ స్టేషన్ ముందు వినతిపత్రం అందజేశారు. ఏఈ మాట్లాడుతూ అధికారుల దృష్టికి పంపింస్తామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

కల్వకుర్తి : డ్రంకన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష పడినట్లు స్థానిక ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అధికంగా మద్యం వాహనాలు నడుస్తున్న వ్యక్తులను తనిఖీలు నిర్వహించి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావ్య శుక్రవారం నలుగురులో ఒకరికి మూడు రోజులు, మరొకరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఆయన తెలిపారు. కల్వకుర్తికి చెందిన దాసర్ల అర్జున్, సభావాత్ మున్య, ఆంగోతు శ్రీను, బత్తుల పర్వతాలులకు జైలు శిక్ష పడ్డట్లు ఆయన తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ప్రతిరోజు కల్వకుర్తి పరిసర ప్రాంతాలలో వాహనాల తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

సమగ్ర గ్రామాభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభం

- కలెక్టర్ బీ.ఎం. సంతోష్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా .. భవిష్య భరత్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్‌తో కలిసి, నీతి ఆయోగ్ ఆశావహ బ్లాక్స్ ప్రోగ్రామ్ ఏబీపీ కింద సమగ్ర గ్రామా భివృద్ధి ప్రాజెక్టును ప్రారంభించినట్లు కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అన్నారు. ఈ కార్యక్రమం, నీతి ఆయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా, గట్టు మండలంలోని 12 దత్తత గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. సంపూర్ణత అభియాన్ లక్ష్యాలలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో భవిష్య భరత్ 10 గ్లూకో మీటర్లు ,4000 స్ట్రిప్స్ , లాన్సెట్లను కలిగిన 10 బాక్సులను భవిష్య భారత్ సభ్యులు కలెక్ట ర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గట్టు మండలంలో సంస్థ ద్వారా గ్రామస్తుల ఆరోగ్యం మెరుగుపరిచే దిశగా చేపట్టనున్న పనులపై భవిష్యత్తు ప్రణాళికలను సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో భవిష్య భరత్ సలహాదారు డా. జయంత్ ఉపాధ్యాయ, రాష్ట్ర సమన్వయకర్త వినయ్, నీతి ఆయోగ్ సమన్వయకర్త అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. హర్షం

నవతెలంగాణ - ఉండటల్లి

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షం పంటలకు అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. గత రెండు రోజుల నుంచి నిరంతరం కురుస్తున్న వర్షాలతో పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని, ఎడతెరిపిలేని వర్షాల వల్ల రైతులు పొలాల్లో పనులు చేసుకోలేక ఇండ్ల దగ్గర ఉండే పరిస్థితులు నెలకొన్నయి.అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు అనుకూలంగామారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 5.7 మిల్లీ మీటర్ల వర్షపాతం..

మండలంలోనూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం 5.7 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు తహసీల్దార్ సలీం ఉద్దీన్ తెలిపారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కృష్ణ, తుంగభద్ర నదుల ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రుణమాఫీ డబ్బులు .. రైతుల ఖాతాల్లో జమ

నవ తెలంగాణ - ఉండవల్లి

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు.. శుక్రవారం రైతుల అకౌంట్లో రుణమాఫీ డబ్బులు జమ అయ్యాయి. రైతులకు రుణమాఫీ సొమ్ము ఆసరాగా నిలిచిందని రైతుల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లోపు రుణాలు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో మాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అలంపూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలో లక్ష లోపు రుణాలు ఉన్న రైతులు 297 మంది 87 మంది రైతులకే రుణమాఫీ సొమ్ము జమైనట్లు మిగిలిన రైతులకు లక్ష రుణాలు ఉన్నవారు రైతులకు రావాల్సి ఉన్నదని అల్లంపూరు పీఏసీఎస్ సీఈవో కేశవరెడ్డి తెలిపారు. పూర్తి సమాచారం కొరకు సొసైటీలో నోటీస్ బోర్డుల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ నిబం ధనల మేరకు.. రుణమాఫీ అమలు చేసేందుకు ప్రభుత్వం అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అల్లంపూర్ పీఏసీఎస్ సొసైటీలో రుణమాఫీ కావాల్సిన రైతులు మొత్తం 350 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎడతెరపీలేకుండా కురుస్తున్న వర్షం



నవ తెలంగాణ - గట్టు

అల్పపీడన ప్రభావంతో గట్టు మండలంలో గత మూడు రోజుల నుంచి ఎండతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి..రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. వాతావరణం శాఖ మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. దీంతో వేరుశనగ పంటలు పెరికిన వాటిని పొలాలలోని అలానే ఉండిపోయి వాటిని ఇలాగనే వర్షాలు పడితే వేరుశనగ పీకినవి మొలకలు వచ్చే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వర్షాలు పడితే పూర్తిగా నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతుల పేర్కొంటున్నారు. ఈ వర్షంతో వరి, తదితర పంటలకు మేలు చేకూరుతుందని కొందరు రైతులు పేర్కొంటున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐలు శ్రీనివాస్ రావు, కేటీ మల్లేష్

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల / గట్టు





తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణ మాఫీని అదనుగా తీసుకొని సైబర్ నేరస్థులు బ్యాంకుల పేరుతో, వాట్సాప్ ప్రొఫైల్ ఫోటోలో బ్యాంకు లోగో లతో వాట్సాప్‌లో బ్లూ కలర్‌లో కొన్ని మోసపూరితమైన లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని ఎస్ఐలు శ్రీనివాస్ రావు, కేటీ మల్లేష్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వారి పట్ల ప్రజలు, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లు టచ్ చేసిన లేక డౌన్లోడ్ చేసుకున్న వారి వాట్సాప్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌కు వెళ్లి పోతుందని, అంతే కాకుండా కాంటాక్ట్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ మనం పంపినట్లే తప్పుడు మెసేజ్ వెళ్తుందని అన్నారు. తద్వారా మీకు తెలిసిన వాళ్ల నుంచి మీ పేరుతో డబ్బులు పంపించామని వాట్సప్ ద్వారా కోరుతున్నారని తెలిపారు. గుర్తు తెలియని బ్లూ కలర్ లింకులను లేదా ఏపీకే ఫైల్ కానీ డౌన్లోడ్ చేసుకుంటే, సైబర్ నేరస్థులు మీ గూగుల్, ఫోన్ పే యూపీఐ ఐడీల ద్వారా మీకు తెలియకుండానే డబ్బులు దోచేసే ప్రమాదం ఉందన్నారు. ఏపీకే ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయవద్దన్నారు. ఏదైనా కారణంతో వాట్సాప్ అకౌంట్ పనిచేయకుంటే వెంటనే వాట్సాప్ అప్లికేషన్‌ని డిలీట్ చేసి మళ్లీ కొత్తగా డౌన్లోడ్ చేసుకొని ఆక్టివేట్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కి కాల్ లేదా www. cyber-crime. gov.in లో రిపోర్ట్ చేయాలన్నారు. నేరం జరిగిన తర్వాత ఎంత త్వరగాపై నెంబర్ కి కాల్ చేసి రిపోర్టు చేస్తే అంత త్వ రగా డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతిలో పడకుండా కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.

రెండువేలమందికిపైగా.. రుణమాఫీ

- మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్

నవతెలంగాణ - ఆత్మకూర్

ఆత్మకూర్, అమర చింత మండల పరిధిలోని బ్యాంకులలో ప్రస్తుతం లక్ష రూపాయల రుణమాఫీలు 2515 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు . అమరచింత యూనియన్ బ్యాంకు నందు 972 మంది రైతులకు, 56,21, 5093 రూపాయలు ,ఎబీఐ బ్యాంక్ నందు 1012 రైతులకు 59,73 ,91,99 రూపాయలు, ఏపీజీవీబీ బ్యాంకు నందు, 243 రైతులకు 13, 51, 9577, రూపాయలు, డిసిసిబి బ్యాంకు నందు 69 రైతులకు 39,20,0 325 రూపాయలు, మొత్తము 14,35,47, 787 రూపాయలు రుణమాఫీ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఒక కుటుంబంలో ఇద్దరూ లేదా ముగ్గురు రుణం పొంది ఉండి 50 వేల మాత్రమే రుణం ఉన్నట్లయితే లక్షలోపు మాత్రమే రుణమాఫీ వస్తుందని, లక్ష పైన ఉన్నవారికి త్వరలో రుణమాఫీ వస్తుందని ఇట్టి విషయం రైతులు గమనించాలని పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో రుణం తీసుకొని రీ షెడ్యూల్, నాన్ పెర్ఫార్మన్స్ మొండి బకాయిలుగా ఉన్నవారికి రుణమాఫీ వచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

గద్వాల జిల్లాలోని18 నుండి 30 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతకు హైదరాబాద్, గద్వాల్ లోని వివిధ కంపెనీలలో శిక్షణ ,ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనా అధికారి డా. ప్రియాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఈ నెల 22 న బీ.సీ. స్టడీ సర్కిల్ , గద్వాల్‌లో ఉదయం 11.00 గం. నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొను నిరుద్యోగులు యస్.యస్.సి, ఇంటర్, డిగ్రీ , ఎలక్ట్రీషియన్ (ఐటీఐ ఎలక్ట్రీషియన్/ఇతర) చదివిన వారు అర్హులు అని, ఇందులో సెలెక్ట్ అయిన వారికీ శిక్షణ అనంతరం హైదరాబాద్, గద్వాల్ లోని కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎస్.ఎస్.సీ, ఇంటర్, డిగ్రీ, ఎలక్ట్రీషియన్ (ఐటీఐ ఎలక్ట్రీషియన్/ఇతర) దగ్గర అర్హత గల వారికి ప్రార్థమ్ ఫౌండేషన్ కంపెనీ గద్వాల, హైదరాబాద్ నందు, ఇంటర్ డిగ్రీ అర్హత గల వారు వినూత్న ఫర్టిలైజర్స్ కంపెనీ గద్వాల, కర్నూల్ జిల్లాలో ఉద్యోగవకాశం కనిపిస్తున్నట్లు తెలిపారు.

నీరుగారుతోన్న..'సమాచార హక్కు చట్టం'

- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అమలుకు నోచుకోని వైనం
- అవినీతి, అక్రమాలు అడ్డుపడెదెలా..?
- అయోమయంలో ప్రజలు

నవతెలంగాణ - ఉండవల్లి

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అవినీతి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2005 సంవత్సరంలో సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చారు. అవినీతి, అక్రమాలు తెలుసుకునేందుకు ఈ చట్టం ఎంతో ప్రమాణికంగా ఉన్నది. అధికారుల కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై పూర్తి సమా చారాన్ని అమలు చేయని దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం అధికారుల పై ఉన్న అమలు పరచడంలో పూర్తిగా విఫలమ వుతున్నాయనడంలో సందేహం లేదు. కొత్త జిల్లాలో కొత్త మండలాలు ఏర్పాటు అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ సమాచార హక్కు చట్టం ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారు. సమాచార హక్కు బోర్డును ఏర్పాటు చేయకుండా సమాచారం తెలుపని అధికారులు సమాచారమివ్వని దుస్థితి నెలకొంది. ప్రతి కార్యాలయాల్లోనూ సమాచారం అడిగిన వెంటనే చట్టం ప్రకారం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం అధికారుల పై ఉన్నది. ఉండవల్లి మండలంలోని ఆ పరిస్థి తులు దాపరిస్తున్న అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహ రిస్తుండడంతో ప్రజలకు సమా చారం అందక అవినీతి, అక్ర మాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పూర్తి సమా చారం ఉండని పరిస్థితి. దరఖాస్తు ఫిర్యాదు ఎవరికి ఇ వ్వాలి.. సమాచార అధికారి వివరాలు కూడా ఉండక చట్టా న్ని నీరుగారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికారుల స్పందించి ఈ చట్టాన్ని పకడ్బం దీగా పూర్తిస్థాయిలో అమలు పరచే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమర్థవంతంగా అమలు చేయాలి..


సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి కార్యాల యంలోనూ అభివృద్ధి, సంక్షేమం పై పూర్తి సమాచారం అ డిగే హక్కు ప్రతి పౌరునికి ఉంటుంది. సమాచార ఇవ్వాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది.ఈ చట్టాన్ని తెలియని యకుండా ప్రతి కార్యాలయం సమాచార హక్కు చట్టం వివరాలను నమోదు చేసి పూర్తి వివరాలు పొందు పరచాల్సి ఉండగా మండ లంలో అందుకు విరుద్ధంగా కొనసాగడం కొసమెరుపు. అధికారులు మారుతున్న బోర్డుల పేర్లు మాత్రం మారడం లేదు.. దీనిపై ఉన్నతాధికారులు స్పం దించి. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత తీసుకోవాలని విద్యావంతులు కోరుతున్నారు.

ప్రైవేట్ సంస్థల్లోనూ అమలు చేయాలి..

కార్పొరేటు ఇండస్ట్రియల్ తదితర ప్రైవేట్ సంస్థల్లో కూడా సమాచార హక్కు చట్టాన్ని పొందుపరచాలి. నేడు అందుకు భిన్నంగా మారింది. మండలంలోని 44 జాతీయ రహదారి మీదుగా గోదాములు. ఇండస్ట్రియల్ తదితర వ్యాపార రంగాలు కొనసాగుతున్నాయి. అక్రమాలు చోటు చేసుకుంటున్న సామాన్య మానవునికి సైతం సమాచారం అందక తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితులు లేకపోలేదు. ప్రైవేటు సంస్థల్లో యజమానుల పెత్తందారులు ఇష్టారాజ్యానికి అడ్డుఅదుపు లేకుండా పోతుంది. కార్మికులకు అన్యాయం జరుగుతున్న ఎదిరించలేక పని కోల్పోతామనే భయంతో పనులు చేసే పరిస్థితి. ప్రైవేటు సంస్థల్లో అనేక మోసాలు. అన్యాయాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోక పోవడంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేం దుకు అవకాశం లేకుండా పోయింది. సమాచార హక్కు చట్టం వచ్చి 19 సంవత్సరాలు అవుతున్న సమాజంలో , అధికారుల్లో మార్పు రాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనంగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి ప్రైవేటు సంస్థల్లో కూడా సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి అమలు చేసే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బ్యాంకుల్లో అమలు కాని సమాచార హక్కు చట్టం..

సమాచార హక్కు చట్టం బ్యాంకులలో అమలు కానీ అక్కడ సమాచారం బోర్డు ఉండదు. సమాచారా అడిగితే



చెప్పని పరిస్థితులు నెలకొన్నాయి. బ్యాంకుల్లో సామాన్య ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ చట్టం నిరుగారుతోంది. ఇప్పటికైనా ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుపరిచి సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఉంది.

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవ తెలంగాణ - నారాయణపేట

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రం రైతు వేదిక క్లస్టర్లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నారాయణపేట శాసన సభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దా నాలను అన్నిటిని పూర్తి చేస్తుందని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీని దశల వారీగా ఆగస్టు 15 లోపు మాఫీ చేస్తుందని అన్నారు. గురువారం రైతులకు లక్ష వరకు మాఫీ చేసిందని త్వరలో రెండు లక్షలు రైతులను రుణ విముక్తులను చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు ..

జిల్లా కేంద్రంలోని బహార్ పేట వీధిలో వెలసిన తిరుమల గుట్ట వెంకటేశ్వ రస్వామి ఆలయంలో శుక్రవారం నారాయణపేట శాసనసభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడ మాసం తొలి ఏకాదశి రోజున బహార్ పేటలో తిరుమల గుట్ట వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వర్షాలు బాగా కురవాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించారని రైతుల కళ్ళలో సంతోషం వెదజల్లుతుందని తెలిపారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బండి వేణుగోపాల్, ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ దొడ్డి వరలక్ష్మి కథలప్ప, యువనాయకులు కథలప్ప (కార్తీక్), గడ్డం వినోద్, ఆలయ నిర్వా హకులు ఆకుల వెంకటప్ప మేస్త్రి, పి. అంజప్ప, జి.లక్ష్మీనారాయణ, బీ.అంజి, బాహర్ పేట ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

నవతెలంగాణ - నారాయణపేట

ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధికమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట డీఎస్పీ ఎన్.లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యం లో కొందరు సైబర్ నేరస్థులు ఎదో ఒక బ్యాంకు పేరిట, వాట్సప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు బ్యాంక్ పిక్చర్ లోగో తో వాట్సాప్ లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారు. దీన్ని మనము ఎక్సెప్ట్ చేస్తే మన వాట్స్ యాప్ వాళ్ళ కంట్రోల్ కీ వెళ్లి పోతుంది, అంతే కాకుండా మన కాంటాక్ట్స్ లో వున్న ప్రతి ఒక్కరికి మెసేజ్ వెళు తుందని డిఎస్పి తెలిపారు. దీని ద్వారా సైబర్ నేరస్థులు మన గూగుల్ పే ఫోన్ పే యూపీఐ ద్వారా డబ్బులు దోచేస్తున్నారని అన్నారు. ట్రేండింగ్ లో వున్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారు. ఎంకాబట్టి అందరికి మనవి చేసేది ఏమంటే ఏదయినా గుర్తించదగని ఏపీకె ఫైల్స్ వస్తే మీరు ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయకూడదని తెలిపారు. మీ వాట్స్ యాప్ పనిచేయకుంటే వెంటనే రి ఇంస్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్ లో రిపోర్ట్ చేయాలని, ఎవరైనా ఏదయినా నేరానికి గురి అయితే వెంటనే ఎలాంటి ఆలస్యం చెయ్యకుండా 1930 కు కాల్ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురి అయినట్లయితే వీలైనంత తొందరగా దగ్గరలోని పోలీస్ స్టేషన్ కి రిపోర్ట్ చేయడం ద్వారా మీరు కోల్పోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.



విద్యార్థుల ఆత్మ రక్షణకు కరాటే దోహదపడుతుంది

- కేరళ పాఠశాల డైరెక్టర్ మీరా

నవతెలంగాణ - మక్తల్

విద్యార్థులలో ఆత్మ స్థైర్యాన్ని నింపడానికి కరాటే ఎంతో దోహదపడుతుందని కేరళ పాఠశాల డైరెక్టర్ మీరా అన్నారు. శుక్రవారం కరాటే వ్యవస్థా పకులు సలాం బిన్ ఉమర్ ఆధ్వర్యంలో పాఠశాలలో కరాటే తరగ తులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మీరా మాట్లాడుతూ నేటి సమా జంలో మహి ళలు, అమ్మాయిల పై జరుగుతున్న ఆఘాయిత్యాలను కాపాడడానికి విద్యార్థులలో ఆత్మ స్థైర్యాన్ని నింపడానికి కరాటే తరగతులను ప్రారం భించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కరాటే స్టైల్ చీఫ్ సలాం బిన్ ఉమర్, కరాటే చీఫ్ ఎగ్జామిన ర్ సి. అమ్రేష్, వైస్ ప్రెసిడెంట్ కి అంజన్ ప్రసాద్, కరాటే మాస్టర్ మొహమ్మద్ సలీం, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.





'కృతజ్ఞత సభకు తరలిరండి'

నవతెలంగాణ - మరికల్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 21న మహబూబ్ నగర్ అన్నపూర్ణ గార్డెన్ లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రభుత్వానికి కృతజ్ఞత సభకు జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పీ ఆర్ టీ యూ టీ జీ నారాయణపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్ కుమార్ , నల్గొం డ మహేష్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.శుక్రవారం నారాయణపేట నియో జకవర్గం ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మక్తల్ నియోజకవర్గ శ్రీహరిలకు ఆహ్వాన పత్రిక అందజేశారు. పీఆర్ టీయూటీజీ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న పదోన్నతులు, బదిలీలను పూర్తి చేసిన పదోన్నతులు కల్పించి, విద్యాభి వృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వనికి కృతజ్ఞతగా సభ నిర్వస్తున్నట్లు తెలిపారు.

జూరాల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

- ఐదు గేట్లు ఎత్తివేత
- కొనసాగుతున్న విద్యుతొత్పత్తి

నవతెలంగాణ - ధరూర్



గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 60000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి దిగువకు 37 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 318.516 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 317.140 అడుగులు ఉంది. జూరాల పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.987 టీఎంసీలుగా నమోదైందని అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు వద్ద శుక్రవారం ఐదు క్రాస్ గేట్లు ఎత్తివేసి 37వేల 388 క్యూసెక్కులన్నిటిని దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి నారాయణపూర్ డ్యామ్ నుంచి వరదనీరు 60 వేల క్యూసెక్కుల నీరు జూరాల ప్రాజెక్టుకు చేరింది. దీంతో ప్రదర్శన జూరాల ప్రాజెక్టు అధికారులు శుక్రవారం విద్యుత్ ఉత్పత్తికి సరిపడే నీటితోపాటు నెట్టెంపాడు 1500 భీమా లిస్టు 1300 తో పాటు రైట్ లెఫ్ట్ కెనాలకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో శుక్రవారం నీటిమట్టం 318 516 టీఎంసీల నీరు ఉందని జూరాల అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ - నారాయణపేట

ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ పేట జిల్లా అధికారి వేణుగోపాల రావు నారాయణపేటకు రాకూడదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వాకిటి మహేష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవనంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి కి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అవినీతికి పాల్పడిన అయన మళ్లీ జిల్లాకు వచ్చేందుకు శాఖ పరంగా రాష్ట్రస్థాయిలో పైరవి చేసి పేట కు రావడం చేస్తున్నారని అలాంటి అధికారి రాకూడదని వినతిలో పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మక్తల్ సీఐ. చంద్ర శేఖర్

నవ తెలంగాణ - మక్తల్



భారీ వర్షాల కురుస్తున్న దృష్ట్యా మక్తల్ సర్కిల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా బయటకి రావద్దు అని సీఐ చంద్ర శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ప్రజలు మక్తల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందాలని సూచించారు. ముఖ్యంగా కృష్ణ నది పరివాహక ప్రాంత ప్రజలు చేపల వేటకు వెళ్లరాదని, పుట్టీల ద్వారా ప్రయాణం చేయరాదని, నదిలోకి సెల్ఫీ ఫోటోలకు, ఈత కొట్టడానికి వెళ్లరాదని, తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలన్నారు.ప్రస్తుతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మక్తల్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్త మక్తల్ కుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పాట్లతో ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, చెరువుల వద్దకు వెళ్ళవదు.చెట్ల కింద,పాడైన భవనాలు కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ ముట్టుకోరాదని, ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి, నాలాలు , వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్లరాదని సూచించారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్లపై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు వైపులా బారికేడ్స్,హెచ్చరికలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణ నది, చెరువులు, కుంటల అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకల దగ్గర నీటి ప్రవా హం గురించి ముందస్తు సమాచారం తెలుసుకొని సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాహనదారులు ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి , గుంతలు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించాలని సూచించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జీల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదని తెలిపారు.